సంగారెడ్డిలోని అనాథాశ్రమంలో సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థులు

దోస్త్ మేరా దోస్త్

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సంగారెడ్డి పట్టణంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. స్థానికంగా ఓ ఫంక్షన్ హాలులో సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఫ్రెండ్షిప్ డే సందర్భంగా కలుసుకొని అలనాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. అలాగే సంగారెడ్డి అనాథాశ్రమంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా సంబురాలు జరుపుకున్నారు. హ్యాండ్ బ్యాండ్ కట్టుకొని ఫ్రెండ్షిప్ డే శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ, ఆగస్టు 4

అపూర్వ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఫార్మాసిటీ ఏర్పాటుకు కసరత్తు!

- తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో కొనసాగుతున్న భూ సర్వే
- రెండు వేల ఎకరాలు సేకరించనున్న ప్రభుత్వం
- రెండు లక్షల మందికి ఉపాధి కల్పనకు చర్యలు

డప్పూర్ గ్రామ శివారులో ఫార్మాసిటీ కోసం భూ సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్)

న్యాల్‌కల్, ఆగస్టు 4: తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు కసరత్తు ముమ్మరంగా కొనసాగుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే న్యాల్‌కల్, ఝరాసంగం నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్) ప్రాజెక్టు కింద 17 గ్రామాల్లో 12,635 ఎకరాల భూములను సేకరించేలా సంబంధిత అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇప్పటికే ఆయా మండలాల పరిధిలో భూసేకరణ పనులు జోరుగా సాగుతున్నాయి.

20 రోజుల్లో సర్వే పూర్తి

తాజాగా మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామ శివారులో సంబంధిత అధికారులు ఫార్మాసిటీ కోసం భూ సర్వేను ముమ్మరం చేశారు. ఆయా గ్రామాల పరిధిలో 2 వేల ఎకరాలు సేకరించడే లక్ష్యంగా పెట్టుకున్నారు. డప్పూర్ శివారులో 1,465.25 ఎకరాలు, మల్గిలో 282.13 ఎకరాలు, వడ్డిలో 256 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించేందుకు సర్వే చేపడుతున్నారు. కలెక్టర్ వల్లూరి క్రాంతి సంబంధిత అధికారులతో కలిసి భూ సర్వేను పరిశీలించారు. భూములు ఎవరి అధీనంలో ఉన్నాయో తెలుసుకొని, ప్రభుత్వ భూములు ఎన్ని ఎకరాలున్నాయి, పట్టా భూములు ఎన్ని ఎకరాలున్నాయో పూర్తి వివరాలు సేకరించి నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మరో 20 రోజుల్లో ఫార్మాసిటీ కోసం భూ సర్వేను పూర్తి చేసి నివేదికలను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

2 లక్షల మందికి ఉపాధి

హైదరాబాద్ పట్టణానికి ఫార్మా పరిశ్రమలు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని ఆయా గ్రామాలను ఎంపిక చేసినట్టు సమాచారం. కర్ణాటక సరిహద్దు ప్రాంతంలోని బీదర్ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉండడంతోపాటు అక్కడ ఎయిర్‌పోర్టు, రైల్వేలైన్ అందుబాటులో ఉంది. ప్రస్తుతం ఫార్మాసిటీ ఏర్పాటు చేసే ఆయా గ్రామాల శివారు గుండా నిజాంపేట్-బీదర్‌కు జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఫార్మాసిటీలో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందని ప్రభుత్వం గుర్తించినట్టు తెలిసింది. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు ఫార్మాసిటీలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రానున్నట్టు సమాచారం. ఫార్మాసిటీలో పరిశ్రమల ఏర్పాటుతో వెనుకబడిన మారుమూల ప్రాంతంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే కాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఆయా గ్రామాల పరిధిలో భూ సర్వే పూర్తిగానే కేంద్ర పర్యావరణ, ఆటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ అనుమతి పొందేందుకు నివేదికలను పంపించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఫార్మాసిటీతో ఏర్పాటు చేసే పరిశ్రమలతో ఈ ప్రాంతంలో వాతావరణంతోపాటు భూగర్భజాలలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫార్మాసిటీ ఏర్పాటు విషయంపై ఆయా గ్రామాల ప్రజలు, రైతుల అభిప్రాయాలను సేకరించాల్సి ఉంటుంది. మరి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటతో వేచి చూడాల్సిందే..

రుణమాఫీ కాలేదు..

ప్రభుత్వం రూ.లక్షలోపు రుణాలన్నీ మాఫీ చేశామని చెబుతున్నా నాకు మాత్రం రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదని సంబంధిత అధికారులను అడిగినా సరైన సమాధానం చెప్పడంలేదు. నాకున్న 30 గుంటల భూమిపై దౌల్తాబాద్‌లోని ఇండియన్ బ్యాంక్‌లో 18నెలల క్రితం రూ.60 వేల క్రాప్‌లోన్ తీసుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన మాఫీ లిస్టులో నాపేరు లేకపోవడంతో బ్యాంక్ అధికారులను అడిగాను. ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు మా బ్యాంక్‌కు మాఫీ వివరాల లిస్ట్ రాలేదంటున్నారు. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- రవిగౌడ్, కోన్యాల, సంగారెడ్డి

రైతుబంధు రాలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతుబంధు, పంట రుణాల మాఫీ అన్నీ సక్రమంగా జరిగినయి. ఇప్పుడు రైతులకు ప్రతీ పథకం అందజేసే విషయంలో చాలా ఇబ్బందులు పెడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రుణాలు మాఫీ చేసిన తర్వాత కొత్తగా దౌల్తాబాద్ ఇండియన్ బ్యాంక్‌లో రూ.52 వేల పంట రుణం తీసుకున్న. కానీ, ఇప్పుడు మాత్రం రుణమాఫీకి ఏవో సాంకేతిక కారణాలు చూపుతున్నారు. మరి గతంలో కూడా రుణమాఫీ జరిగిందిగా.. అప్పుడు సాంకేతిక లోపాలు లేకుండేనా..? అప్పుడు లేని లోపాలు ఇప్పుడే వచ్చాయా? అధికారులు సమాధానం చెప్పాలి. ఈ ప్రభుత్వం వచ్చాకా రైతుబంధు లేదు, రుణమాఫీ లేదు ఇదేనా ప్రజా పాలన.

- వెంకట్‌రెడ్డి, నస్తీపూర్, సంగారెడ్డి

విద్యారంగ అభివృద్ధికి కృషి

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానించిన ఎస్టీయూ నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 4: ఉపాధ్యాయ హక్కుల కోసం ఏర్పడిన ఎస్టీయూ సమస్యలపై పోరాడుతూ విద్యారంగాన్ని రక్షించుకుందామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సాబేర్‌అలీ అన్నారు. స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్టీయూ భవన్‌లో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 900 మంది ఉపాధ్యాయులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ప్రైమరీ హెడ్‌మాస్టర్స్‌గా పదోన్నతి ఇప్పించిన ఘనత ఎస్టీయూకే దక్కిందన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు ఉన్నారు.

20 రోజులుగా వరద నీటిలోనే..

ఊట్ల గ్రామంలో రోడ్డుపై పదిహేను రోజులుగా నిలిచిన నీరు

జిన్నారం, ఆగస్టు 4: అసలే వానకాలం.. వ్యాధులు సోకే సమయం.. 20 రోజులుగా రోడ్డుపై ఇలా నీళ్లు కనిపిస్తున్న ఫొటో ఊట్ల గ్రామంలోనిది. గ్రామాలు అపరిశుభ్రంగా మారుతున్నా.. రోడ్లపై నీళ్లు నిలిచినా ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. దీంతో రోజుల తరబడి నీళ్లు నిలవడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను గుర్తించి రోడ్డుపై నిలిచిన నీటిని దారి మళ్లించి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కల్హేర్, ఆగస్టు 4: కల్హేర్ మండలం మార్డి గ్రామంలో రిటైర్డ్ టీచర్ బాగారెడ్డి, మరో ఇద్దరు ఇటీవల మృతి చెందారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం వారి ఇండ్లకు వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. ఈయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, నాయకులు జనార్దన్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారెడ్డి, అంజిరెడ్డి, శ్రీను, భూమయ్య, రాజు, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, మచ్చేందర్, రాజాగౌడ్, గైని సాయి లు, గైని కుమార్, పాల్గొన్నారు.

తుర్కపల్లిలో..

నారాయణఖేడ్, ఆగస్టు 4: బాధిత కుటుంబ సభ్యులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఆదివారం నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన కళావతి మృతి చెందిడంతో విషయం తెలుకున్న మాజీ ఎమ్మెల్యే గ్రామానికి చేరుకొని నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భూమయ్య ఉన్నారు.

కల్హేర్: బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

బోనాల పండుగలో మాజీ ఎమ్మెల్యే పూజలు

మనూరు, ఆగస్టు 4: మనూరు మండల పరిధిలోని దోసపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఆషాఢ మాసం బోనాల ఊరేగింపులో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విఠల్‌రావు, గ్రామస్తులు సంగన్న, సంజీవ్, గుండప్పలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

విద్యార్థులకు నోట్ బుక్కులు పంపిణీ

సిర్గాపూర్, ఆగస్టు 4: సిర్గాపూర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం విద్యార్థులకు నోటు బుక్కులను హాస్టల్ వెల్ఫేర్ అధికారి కిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు విద్యార్థులకు క్రీడలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.



పటాన్‌చెరు: సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్స్‌తో ఆరోగ్య భరోసా

పటాన్‌చెరు, ఆగస్టు 4: సీఎం రిలీఫ్ ఫండ్స్‌తో ఆరోగ్య భరోసా కలుగుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మొత్తం 179మంది లబ్ధిదారులకు రూ.63 లక్షల 28 వేల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం అవుతుందని చెప్పారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేశ్ యాదవ్, జిన్నారం మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి, ఐలేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

బొల్లారంలో..

బొల్లారం, ఆగస్టు 4: అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానల్లో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసానిస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బొల్లారం మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ గోపాలమ్మ, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాల వద్ద ఆందోళన

జిన్నారం, ఆగస్టు 4: ఖాజీపల్లి శివారులోని నారాయణ కళాశాల వద్ద గ్రామస్తులు ఆందోళన చేశారు. విద్యార్థుల కోసం కళాశాలకు వచ్చేవారి కార్లు రోడ్డుపై పార్కింగ్ చేస్తుండడంతో కొంత కాలంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం విద్యార్థుల కోసం కళాశాలకు వచ్చిన వారి వాహనాలు రోడ్డుపై పార్కింగ్ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అటువైపు నుంచి వెళ్లిన పలువురు ఖాజీపల్లి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో భారీగా చేరుకొని కళాశాల వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వ రోడ్డును పార్కింగ్‌గా వాడుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసి, కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. రోడ్డుపై కార్లు పార్కింగ్ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కళాశాల యాజమాన్యం సొంతగా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకుడు ఆకుల నవీన్‌కుమార్ సూచించారు. ఆందోళనలో అశోక్, మహేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సంగారెడ్డి, ఆగస్టు 4: దాదాపు 29 ఏండ్ల క్రితం కలిసి విద్యనభ్యసించి అప్పటి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని చిన్ననాటి తీపి గుర్తులను తలుచుకుంటూ అప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో 1995-96 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థి నవీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు శాలువాలతో సన్మానించారు.

మంత్రికి దండోరా నాయకుల సన్మానం

అందోల్, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణకు మంత్రి దామోదర రాజనర్సింహా ఎనలేని కృషి చేశారని దండోరా తొలి ఉద్యమ నాయకుడు సంజీవయ్య అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజనర్సింహను కలిసిన నాయకులు వర్గీకరణకు కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, యోహాన్ పాల్గొన్నారు.

బ్యాండేజీ కడుతున్న బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి

ఘనంగా ప్రపంచ స్నేహితుల దినోత్సవం

గుమ్మడిదల, ఆగస్టు 4: ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఇందులో నల్లవల్లి మాజీ సర్పంచ్‌లు దోమడుగు శంకర్, శ్రీనివాస్‌ముదిరాజ్, బీఆర్ఎస్ నాయకులు సూర్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులకు బ్యాడ్జిలకు కట్టారు. సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

భక్తజన సంద్రంగా కేతకీ

స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో సందడిగా కేతకీ ఆలయ పరిసరాలు

ఝరాసంగం, ఆగస్టు 4: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. అమావాస్య, పుష్యమి నక్షత్రం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు స్వామివారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే తరలివచ్చారు. భక్తులు అమృత గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి జలలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామివారి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకముందు అర్చకులు స్వామివారికి అమావాస్య ప్రత్యేక పూజలుగా లింగానికి క్షీరాభిషేకం, అన్నపూజ, గుండపూజ, మహా మంగళ హారతి, మహా రుద్రభిషేకం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శశిధర్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఎస్ఐ నరేశ్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేను పూలమాల శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్, తదితరులు ఉన్నారు.

నేటి నుంచి శ్రావణ మాస పూజలు

గుమ్మడిదల, ఆగస్టు 4: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శశిధర గుప్తా ఆదివారం ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు బొంతపల్లి, వీరన్నగూడెం గ్రామాల పెద్దలతో కలిసి పట్టువస్త్రాలు సమర్పించి అభిషేకాలు, పూజలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా ఆలయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని కోరారు.

నేటి నుంచి లక్ష బిల్వార్చన

కోహీర్, ఆగస్టు 4: మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో సోమవారం నుంచి శ్రావణ మాసోత్సవాలను నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సెప్టెంబర్ 2వ తేదీ వరకు లక్ష బిల్వార్చన చేపట్టనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శివరుద్రప్ప తెలిపారు. ఆలయంలో నెలరోజులపాటు ప్రత్యేక పూజలు ఉంటాయని చెప్పారు. శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకొని నిత్యాన్నదానం చేయనున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకోనున్నారు.

గుమ్మడిదల: ముస్తాబైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

గుమ్మడిదల, ఆగస్టు 4: గుమ్మడిదల మండల పరిధిలో దోమడుగు, బొంతపల్లి వివిధ గ్రామాల్లో బొంతపల్లి విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ ఆదివారం పర్యటించారు. వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వినియోగదారులతో తెలిపారు. నేరుగా వినియోగదారుల దగ్గరికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

గుమ్మడిదల: అన్నారంలో బోనాలతో వెళ్తున్న మహిళలు

వైభవంగా బోనాలు

గుమ్మడిదల/న్యాల్‌కల్, ఆగస్టు 4: మండలంలోని అన్నారం గ్రామంలో ఘనంగా గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. ఉదయం పోచమ్మతల్లి అమ్మవారికి ఘటాల ఎదుర్కోళ్లు, ఫలహారం బండి ఊరేగింపు, యువకులు తొట్టెలతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. మహిళలు పెద్దసంఖ్యలో బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించారు. పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లు అలరించాయి. న్యాల్‌కల్ మండలం హద్నూర్ గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు నెత్తిన బోనాలతో వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

న్యాల్‌కల్: హద్నూర్‌లో నెత్తిన బోనాలతో వెళ్తున్న భక్తులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంగారెడ్డి, ఆగస్టు 4: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్-2ఏఈ శ్రీకాంత్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం మరమ్మతుల కారణంగా ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ అధికారులకు వినియోగదారులు సహకరించాలని కోరారు. ఆనంద్ ఆర్ట్స్ కలెక్టరేట్ నుంచి ఎస్ఎస్‌రెడ్డి స్వీట్ హౌస్, బైపాస్ ఐబీ నుంచి ఎస్‌బీఐ వరకు, అంగడిపేట్, చింతల్‌పల్లి, కలబ్‌గూర్, హాస్టల్‌గడ్డ, ముబారక్‌పూర్, ఇరిగిపలి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంజాయి సాగు చేస్తే పీడీ యాక్టు కేసు

నాగల్‌గిద్ద, ఆగస్టు 4: గంజాయి సాగు చేస్తే వారి ఆస్తులు జప్తు చేసి పీడీ యాక్టు నమోదు చేస్తామని ఎస్ఐ సాయిలు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కరస్‌గుత్తి, ఇరక్‌పల్లి, గంగారాం తండాల్లో వ్యవసాయ పొలాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గంగారాం తండాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చేసేవారిపై ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చిందని, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అందవన్నారు. ఎవరైనా గంజాయి రవాణా చేసినా, సాగుచేస్తున్నట్లు గుర్తించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద నీటి తొలిగింపు

జిన్నారం, ఆగస్టు 4: ఖాజీపల్లి శివారులోని ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద వర్షాలకు నీరు నిలవడంతో పదిహేను రోజులుగా రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. ఖాజీపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. నాయకులు ఆకుల నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్ చిట్ల సత్యనారాయణ, గద్దె నర్సింహ ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద నిలిచిన నీటిని ఆదివారం తొలిగించారు. దీంతో రాకపోలకు మార్గం సగమమయింది. వాహన రాకపోకలకు ఇబ్బందులు తొలిగిపోయాయి.

ఈ నెల 18న ఐదుగుళ్ల పోచమ్మ బోనాలు

రామచంద్రపురం, ఆగస్టు 4: రామచంద్రపురం డివిజన్ మందుముల ఐదుగుళ్ల పోచమ్మ తల్లి శ్రావణ మాస బోనాలను ఈనెల 18వ తేదీన నిర్వహించేందుకు కార్పొరేటర్ పుష్ప నాగేశ్ సమక్షంలో గ్రామ పెద్దలు తీర్మానించారు. ఈ మేరకు ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, చైర్మన్ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని కులస్తుల పెద్దలు, నాయకులతో సమావేశం నిర్వహించి బోనాల పండుగ తేదీని ఖరారు చేసి ప్రకటించారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.